క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

మహా ర్యాలీ..

పాల్వంచరూరల్: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని బుధవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన మహా ర్యాలీని విజయవంతం చేయాలని ఆదివాసీ రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ కోరారు. స్థానిక కుమురంభీం భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ఉదయం 11 గంటలకు కొత్తగూడెంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి కొత్తగూడెం ప్రకాశ్ స్టేడియం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివాసీలు అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

శివకుమార్‌కు 'సేవారత్న' అవార్డు



అవార్డు అందుకుంటున్న శివకుమార్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడేనికి చెందిన డాక్టర్ మద్దెల శివకుమార్ మెగా మల్టీ టాలెంటెడ్ సెలబ్రెటీ ఆఫ్–2025 ఉత్తమ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఏ1 బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు 2025 అభినవ ఆర్ట్స్ అకాడమీ అధినేత అభినవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం అవార్డు ప్రదాన కార్యక్రమం జరిగింది.

26న బైక్ ర్యాలీ

టేకులపల్లి: 28న భద్రాచలంలో జరగనున్న ఆదివాసీల ధర్మయుద్ధం కార్యక్రమంలో భాగంగా 26న టేకులపల్లిలో జరగనున్న ఆదివాసీల బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ కల్తి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇరప లక్ష్మీనారాయణ, ఉకే బుచ్చయ్య, కుంజ సురేష్, గొగ్గల రమేష్, వజ్జ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్లు మంజూరు చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ నూతన పెన్షన్లు మంజూరు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటి వరకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడం గర్హనీయమన్నారు. వేలమంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు దరఖాస్తు చేసుకుని పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో లావుడ్యా వెంకటేష్, బానోత్ నాగరాజు, జర్పుల లాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మెప్పు పొందాలి

ఇల్లెందురూరల్: ప్రభుత్వం నిర్దేశించిన విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజలు మెచ్చేలా నడుచుకోవాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గ్రామపాలన అధికారులతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామపాలనలో రెవెన్యూ విభాగం కీలకమైందని చెప్పారు. పలు సమస్యలతో వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, తమ వల్ల కాని పనిని పైఅధికారులకు తెలియజేయాలన్నారు.

25న గ్రంథాలయంలో బతుకమ్మ వేడుకలు

టేకులపల్లి: 25న టేకులపల్లి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో లైబ్రరీ వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ నాగన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు, యువతులు తప్పకుండా హాజరై బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

27న ప్రకాశం స్టేడియంలో..

కొత్తగూడెంఅర్బన్: బతుకమ్మ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జీఎం(పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్ఆర్ జీవీ.కిరణ్ కుమార్ మంగళవారం హెడ్డాఫీసులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాట్లాడాతూ.. బతుకమ్మ సందర్భంగా 25న సింగరేణి ప్రధాన కార్యాలయంలో, 27న కార్పొరేట్ ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో బతుకమ్మ ప్రధాన వేడుకలు, ఫ్యామిలీ డే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్తమ బతుకమ్మలక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

'ఇందిరమ్మ' పేరిట దందా..

- లూటీ అవుతున్న గుట్టలు, వాగులు
- దర్జాగా సాగుతున్న మట్టి, ఇసుక రవాణా
- పట్టించుకోని అధికారులు


రాజీవ్‌నగర్ తండా సమీపంలోని మట్టి కోసం తవ్విన గుట్ట, టిప్పర్‌లో తరలిస్తున్న మట్టి

ఇల్లెందురూరల్: ఇన్నాళ్లు ఇసుక దందా చెలాయించిన అక్రమార్కులు తాజాగా మట్టి మాఫియాకు తెరతీశారు. అర్ధరాత్రి వేళ వీరు సాగిస్తున్న దందాకు మండలంలోని పలు గ్రామాలలో కొండలు, గుట్టలు తరిగి పోతున్నాయి. అధికారులకు ఫిర్యాదులు అందినా ఏ చర్యలు లేకపోవడంతో మాఫియా మరింత బరితెగించి మట్టి తవ్వకాలు జరుపుతోంది.

ఇళ్ల కోసమంటూ ఇసుక తరలింపు..

ఇందిరమ్మ పథకంలో భాగంగా మండలంలో పైలెట్ ప్రాజెక్టు పూబెల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. తొలి విడతలో 280 ఇళ్లను మంజూరు చేశారు. కానీ ఇసుక లబ్ధిదారులకు తలకు మించిన భారంగా మారింది. ఈ తరుణంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. దీనికోసం లబ్ధిదారుల పేరిట కూపన్లు ఇస్తామని కూడా తెలిపింది. కానీ పైలెట్ గ్రామంగా ఎంపికైన పూబెల్లి గ్రామంలో సగం ఇళ్ల నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నా ఒక బొచ్చ ఇసుక కూడా వారికి ఉచితంగా అందలేదు. వాస్తవంగా ఒక ఇంటి నిర్మాణానికి 60 టన్నుల ఇసుక అవసరం అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు చెపుతున్నారు.

అంటే అంత మొత్తం ఇసుకను పూబెల్లి గ్రామంలో లబ్ధిదారులు ప్రైవేటుగా కొనుగోలు చేయక తప్పలేదు. ఇక తరువాత మంజూరైన ఇళ్లకు సైతం ఇసుక అవసరం ఏర్పడటంతో దళారులు సమీపంలోని వాగుల నుంచి రాత్రివేళలో తోడి లబ్ధిదారుల ఇళ్లకు చేరుస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4వేల వరకు చెల్లిస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. మరి ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు చేసిన ప్రకటన ఫలాలు ఎటు వెళుతున్నాయో.. ప్రచారంలో ఉన్నట్లు వాస్తవంగా లబ్ధి దారుల పేరిట కూపన్లు జారీ చేసి ఉంటే.. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లకు కూపన్లు జారీ చేశారు.. ఎన్ని ట్రిప్పుల ఇసుక ఉచితంగా లబ్ధిదారుల చెంతకు చేరింది.. వంటి విషయాలను విచారిస్తే మండలంలో ఇసుక మాఫియా బాగోతాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి...

ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇంటిని నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బేస్‌మెంట్ నిర్మాణం తరువాత అంత ఎత్తులో ఉన్న స్థలం అంతా లెవల్ చేసుకునేందుకు మట్టి అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇంటి పథకాన్ని అడ్డుపెట్టుకొని అక్రమార్కులు రూ.లక్షలు విలువ చేసే మట్టిని యదేచ్ఛగా కొల్లగొడుతున్నారు. రెవెన్యూ, అటవీభూములు ఎక్కడపడితే అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమార్కులు రాత్రివేళల్లో జేసీబీలు, టిప్పర్ల సహాయంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి మటిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ మట్టి రూ.వెయ్యి, టిప్పర్ మట్టి రూ.3వేల నుంచి రూ.4వేలు చొప్పున విక్రయిస్తున్నారు. మట్టితవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు...

వాస్తవంగా మట్టి, ఇసుక తదితర సహజ వనరులను తరలించడం కోసం ప్రభుత్వానికి సంబంధిత రవాణాదారులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీనికోసం పలు విభాగాల నుంచి అనుమతి తీసుకొని నిర్దేశించిన ప్రాంతంలో, సూచించిన పరిమాణంలోనే తవ్వకాలు చేపట్టాలి. కానీ మండలంలో మట్టి, ఇసుక మాఫియా వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ యదేచ్ఛగా అక్రమంగా రవాణా చేస్తున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్, భూగర్భ జలశాఖ అధికారులు ఎలాంటి చర్యలకు తీసుకోవడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వానికి పన్ను ఎగవేస్తూ అక్రమార్కులు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. ఇదంతా తెలిసినా సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.


వాగులో నుంచి తరలిస్తున్న ఇసుక

ఎవరికీ అనుమతులు లేవు



మండలంలో ఇసుక, మట్టి తవ్వకాలకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందిరమ్మ పథకంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన ఒక్కో ఇంటికి 20 ట్రాక్టర్లు చొప్పున లబ్ధిదారులు మాత్రమే రవాణా చేసుకునేలా సింగరేణి ద్వారా అనుమతి ఉంది.

– రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు

26న వేలంపాట

కొత్తగూడెంఅర్బన్: నాటు సారాయి కేసులలో పట్టుబడిన వాహనాలకు కొత్తగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో 26వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో వాహనాలు కొనుగోలు చేయదలచిన వారు ఉదయం 11 గంటల వరకు స్టేషన్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి..

పాల్వంచరూరల్: జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ దారా ప్రసాద్‌కు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అబ్బురామ్, కార్యదర్శి లెనిన్ వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఇంటి స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. చంద్ర నర్సింహారావు, గగనం శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, తోట శ్రీనివాస్, అడపాల వెంగళరావు, పుల్లారావు, సీహెచ్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

సుజాతనగర్: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రాఘవాపురంలో ఎక్స్‌రే శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బి.రమేష్ మాట్లాడుతూ టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో టీబీ వ్యాధికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 39 మందికి ఎక్స్‌రేలు తీసి తొమ్మిది మంది అనుమానితుల నుంచి రక్తన మూనాలు సేకరించినట్లు చెప్పారు. టీబీ సూపర్‌వైజర్ రఫేల్, జానకీరాం పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలి


దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

ఇల్లెందు: ఇల్లెందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇల్లెందులో న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాద రక్షణ చట్టం తీసుకుని రావాలని కోరారు. ఇటీవల కాలంలో పలు జిల్లాల్లో న్యాయవాదుల మీద దాడులు జరుగుతున్నాయని తెలిపారు. నిత్యం కక్షిదారుల కోసం వివిధ వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడే న్యాయవాదుల మీద దాడులు జరుగుతున్నాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కీర్తి కార్తీక్, ఎస్. వెంకటేశ్వర్లు, ఎన్.మల్లికార్జునరావు, పి.బాలకృష్ణ, వెంకటనర్సయ్య, మామిడి సత్యప్రకాష్, అనిల్‌కుమార్, నవీన్‌కుమార్, ధనుంజయరావ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్, ఎస్.రంగనాథ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షను సందర్శించి సంఘీబావం తెలిపారు. అబ్దుల్ నబీ, జాఫర్ హుస్సేన్, లలిత్‌కుమార్ పాసీ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికులకు అయిదు నెలలుగా ఉన్న పెండింగ్ వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ, కార్యదర్శి ఎస్‌హెచ్ సుల్తానా మాట్లాడుతూ... పండుగ సమయంలో ప్రభుత్వం కార్మికులకు బిల్లులు, వేతనాలు చెల్లించకుండా పస్తులు ఉంచడం సరైంది కాదన్నారు. సీఎం ఏ సభకు వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించే మాట్లాడుతున్నారని కానీ ఆచరణలో మాత్రం మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, సహాయ కార్యదర్శి కే.సత్య, వెంకటనర్సమ్మ, రాణి, ఇస్తారమ్మ, నాగలక్ష్మి, స్వరూప, క్రాంతి, మంగీ, కుమారి పాల్గొన్నారు.

సరిపడా యూరియా పంపిణీ చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): రైతులందరికీ సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ అన్నారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డ్‌లో యూరియా సరఫరా కేంద్రం వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి ప్రభుత్వం వెంటనే స్పందించాలని జాతీయ రహదారిపై సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పాల్వంచరూరల్: రైతుల పంట అవసరాలకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని, పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరు కిషోర్ తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ప్రతీరోజు రైతులు వ్యవసాయ పనులు వదులుకొని తిండిలేక యూరియా కోసం క్యూలో నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని, పత్తికి కనీస మద్దతు ధర రూ.10,075 ప్రకటించాలని, నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


ఇల్లెందురూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఈ కార్యక్రమంలో రాయబారపు వెంకటేశ్వర్లు, గోనేల రమేష్, పద్మ, కుంజా భాస్కర్, రామ్, శ్రీను, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేస్తూ మాస్‌లైన్ నేతలు మంగళవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న మాట్లాడుతూ.. యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరితో రైతులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీరాం కోటయ్య, బోస్, జూకంటి గాంధీ, బుర్ర రాఘవులు, చందావత్ బాలు, బుర్ర లక్ష్మయ్య, గుర్రం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి..

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి ప్రైవేట్ కన్వేయన్స్ డ్రైవర్స్ యూనియన్ – ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్పొరేట్ సివిల్ ఎస్ఈ పి.రాజేంద్రప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కే.డబ్ల్యూ కిష్టాఫర్ మాట్లాడుతూ సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో ఇల్లెందు బంగ్లోస్‌లో ఇటీవల కొత్తగా నిర్మించిన ఎంఏ క్వార్టర్లలో ఉంటున్న జనరల్ మేనేజర్స్, వారి ప్రైవేటు కన్వేయన్స్ డ్రైవర్లకు షెల్టర్ నిమిత్తం రెస్ట్ రూములు, డైనింగ్ హాలు, బాత్‌రూముల సౌకర్యాలు కల్పించాలన్నారు. డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు జె.మధుకుమార్, కార్యదర్శి ఈ.ప్రవీణ్‌కుమార్ నాయకులు లక్ష్మీనారాయణ, లోకేష్, తాజుద్దీన్, ఖాన్, సతీష్, ప్రభాకర్, సూర్య, రవి, జయరాజ్, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయం గర్హనీయం

సింగరేణి(కొత్తగూడెం): గుర్తింపు సంఘాన్ని పిలువకుండా లాభాల వాటా విషయంలో ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. మంగళవారం శేషగిరిభవన్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. సింగరేణి కార్మికుల మనోభావాలను దెబ్బతీశారని, ఈనెల 20న ఏఐటీయూసీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే సాంబశివరావు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సింగరేణి కార్మికులకు లాభాల వాటా తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మాట్లాడగా.. డిప్యూటీ సీఎంని కలిసి లాభాల వాటా గురించి మాట్లాడుకోమన్నారని తెలిపారు. 11వ వేజ్‌బోర్డ్ కాలంలో కూడా కోర్టుకు వెళ్లి జాప్యం చేసి చివరి రోజున కలవటం జరిగిందన్నారు. ఇలా ఐఎన్‌టీయూసీ కార్మికులకు మంచి చేస్తున్నారా.. లేక చెడు చేస్తున్నారా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వంగా వెంకట్, రమణమూర్తి, వి.మల్లికార్జున్‌రావు, కే.రాములు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.రాము, ఎస్.శ్రీనివాస్, హుమాయిన్, గోపికృష్ణ, బండారు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన...

కొత్తగూడెం ఏరియా పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంఘం ప్రధాన కార్యాదర్శి కాపు కృష్ణ మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చే లాభాల్లో 75శాతం పైగా కోత విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది సింగరేణి భవిష్యత్ ప్రణాళిక కోసమని పక్కన పెట్టిన రూ.2,289 కోట్లు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడప రాజయ్య, కాగితం విజయ్‌కుమార్, కుమార్, రాజ్ కుమార్, అశోక్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, విద్యాసాగర్, రాజేశ్ అనుదీప్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నిరసన తెలిపిన కాంట్రాక్ట్ కార్మికులు..

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన లాభాల్లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరిగిందనీ, ఇఫ్టూ ఆధ్వర్యంలో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్.సంజీవ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రూ.6,094 కోట్ల లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్మనెంట్ కార్మికులకు రూ.1.95 లక్షలు ప్రకటించిన ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 ప్రకటించటం అత్యంత దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, కరుణ, సంధ్య లక్ష్మి, నరసింహా, రామకృష్ణ, కృష్ణ, పాషా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: లాభాల వాటా ప్రకటనలో కాంట్రాక్టు కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం కోయగూడెం ఎల్ఎస్ఎన్ క్యాంపులో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పునరాలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, యాదగిరి, మోహన్, రామదాసు, వీరన్న, రామ, మాన్‌సింగ్, రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ భాగస్వామ్యాన్ని రద్దు చేయాలి


ధర్నా చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డులో ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ జీఓ నంబరు 12ను సవరించి వెల్ఫేర్ బోర్డు ద్వారానే సహజ, ప్రమాద మరణాలు, పాక్షిక, పూర్తిస్థాయి అంగవైకల్యాలకు ఇచ్చే సంక్షేమ నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బదిలీ చేసిన రూ.346 కోట్లను వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుభవజ్ఞులైన ట్రేడ్ యూనియన్ నాయకులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు కనీసం రూ.9వేల పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, పెళ్లి కానుక, ప్రసూతి కానుక రూ.30వేల నుంచి రూ.లక్షకు పెంచాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎసీఎల్ షర్ఫుద్దీన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.పద్మ, కె.సత్య, ఆర్.సుధాకర్, జి.రాములు, రమేష్, కురమయ్య, ఎన్.మధు, మైముద్దీన్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ సహకరిస్తే ఘనంగా బతుకమ్మ

టేకులపల్లి: అందరూ సహకరిస్తే బతుకమ్మ వేడుకగా జరుపుకోవచ్చని ఇల్లెందు ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్‌నాయక్ తెలిపారు. కోదండ రామాలయం గోలియాతండా పంచాయతీ పరిధిలో ఉండగా, గత, ప్రస్తుత ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా గోలియాతండా, టేకులపల్లి పంచాయతీలు ఖర్చు భరించేవని తెలిపారు. గత ఏడాది నుంచి టేకులపల్లి జీపీ నుంచి నిధులు ఇవ్వకపోవడంతో తమ వద్ద ఉన్నంత మేర ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో మాదిరి ఘనంగా వేడుకలు నిర్వహించాలంటే టేకులపల్లి జీపీ బాధ్యులు ముందుకు రావాలని, లేనిపక్షంలో అనవసర ఆరోపణలు చేయొద్దని మంగీలాల్ సూచించారు. ఈ సమావేశంలో భూక్యా హరి, గుగులోత్ బిచ్చు పాల్గొన్నారు.


టేకులపల్లిలో మాట్లాడుతున్న మంగీలాల్

ముమ్మరంగా వాహన తనిఖీలు


పాల్వంచరూరల్: మొండికట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇల్లెందురూరల్: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఇల్లెందు – గుండాల ప్రధాన రహదారిలో మర్రిగూడెం గ్రామం వద్ద కొమరారం పోలీసులు మంగళారం వాహన తనిఖీ నిర్వహించారు. వాహనాల ధృవీకరణ పత్రాలు తనిఖీ చేసి ప్రయాణాల వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగుల్‌మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీ సంపత్ నగర్, పాతర్లగడ్డలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు బోడు ఎస్ఐ పోలిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తూ చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పట్టారు. వాహనదారుల లైసెన్సులను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ఆపి వారి వివరాలను అడిగి తెలుసుకొని ఆధార్ కార్డు, వాహనపత్రాలు పరిశీలించారు.

పాల్వంచరూరల్: మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని మారుమూల ప్రాంతాలు మొండికట్ట, రెడ్డిగూడెం గ్రామాల ప్రధాన రహదారులపై పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. అనుమాన కలిగిన వాహనాలను పరిశీలించారు. ఈ తనిఖీలో సీఐ సతీష్, ఎస్ఐ సురేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాధనం పక్కదారి..

- ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం
- రైతుల మొరను పట్టించుకోని అధికారులు

పాల్వంచరూరల్: రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా ప్రభుత్వ సొమ్ముతో ప్రజలకు ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులకు చేయాల్సిన అధికారులు, పాలకులు, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు సౌకర్యం కలిగించే విధంగా సీసీ రోడ్లు నిర్మించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామపంచాయతీలో గతేడాది ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద మంజూరైన రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్లు మంజూరయ్యాయి. అయితే ఈ రోడ్లను జగన్నాథపురం గ్రామంలో నిర్మాణం చేయాల్సిన ఉండగా పెద్దమ్మగుడి ఎదురుగా ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల చుట్టూ నిర్మాణం చేశారు. ఆ రోడ్డు నిర్మాణాన్ని గత మే 21న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. వాస్తవానికి ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల యజమానులు సొంత ఖర్చులతో నిర్మాణం చేసుకోవాల్సిన రోడ్డును ప్రభుత్వ సొమ్ముతో నిర్మాణం చేయడం విమర్శలకు దారితీసింది. అదేవిధంగా ఫంక్షన్ హాల్ వెనుక నుంచి కూడా సీసీ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో రాకపోకలు లేకున్నా రోడ్డు నిర్మాణం చేయడంతో నిరుపయోగంగా మారింది.

జగన్నాథపురం నుంచి కమ్మరిగూడెం వరకు రోడ్డు మంజూరు చేయాలి..

పెద్దమ్మగుడి ఎదురుగా ముంతాజ్, అమ్మ ఫంక్షన్ హాళ్ల మధ్యలో నుంచి రైతుల పంటపొలాల మీదుగా ఐదు కిలోమీటర్ల డొంక రహదారి ఉంది. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు, స్థానికులు అనేక సంవత్సరాలుగా అధికారులను, పాలకులను విన్నవించుకుంటున్నా ఎవరూ పట్టించుకున్న పాపన పోలేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఫంక్షన్ హాళ్ల వెనుక భాగంలో నిరుపయోగంగా ఉన్న సీసీ రోడ్డు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



జగన్నాథపురం పెద్దమ్మగుడి ఎదుట నుంచి కమ్మరిగూడెం వరకు ఐదు కిలోమీటర్ల రహదారిని నిర్మాణం చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఇంతవరకు మంజూరు కాలేదు. మరోసారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా.

– జాటోతు లక్ష్మణ్‌నాయక్, జగన్నాథపురం

రోడ్డు మంజూరైంది కానీ..



పెద్దమ్మగుడి నుంచి కమ్మరిగూడెం వరకు ఐదు కిలోమీటర్ల రహదారి ఈజీఎస్ కింద ఆరు నెలల క్రితం సీసీ రోడ్డు మంజూరైంది. నిబంధనల ప్రకారం రైతుల పంటపొలాల మధ్యలో సీసీ రోడ్డు నిర్మాణం చేయకూడదు. దీంతో రోడ్డును నిలిపివేయడం జరిగింది. – శివలాల్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ